# నేడు కార్యకర్తలతో రామన్న భేటీ



భిక్కనూర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, సుభాష్‌రెడ్డి

- మాచారెడ్డి, కామారెడ్డిలో పర్యటన
- పాత మండలాల వారీగా ప్రత్యేక సమావేశాలు
- రేపు దోమకొండ, భిక్కనూర్‌లోనూ మీటింగ్‌లు
- గులాబీ శ్రేణులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

నిజామాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో భారీ మెజార్టీయే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నది. కామారెడ్డి నుంచి బీఆర్ఎస్ అధినేత పోటీ చేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రజల్లో పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. సీఎం కేసీఆరే స్వయంగా పోటీ చేస్తామంటే తామంతా మూకుమ్మడిగా ఓట్లేసి గెలిపించుకుంటామంటూ కామారెడ్డి నియోజకవర్గ ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి తీర్మానాలు సైతం చేశారు.ఈ పరిస్థితుల్లో కేసీఆర్ గెలుపు నల్లేరు మీద నడకే అయినప్పటికీ మెజార్టీ మాత్రం భారీగా రావాలనే సంకల్పంతో బీఆర్ఎస్ దృష్టి సారించింది. ఇందులో భాగంగా కామారెడ్డి నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇప్పటికే నియోజకవర్గం నేతలతో పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించిన కేటీఆర్ ప్రస్తుతం మండలాల వారీగా ప్రభుత్వ విప్, స్థానిక ఎ మ్మెల్యే గంప గోవర్ధన్‌తో కలిసి సమావేశాలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. నేడు పాత మాచారెడ్డి, పాత కా మారెడ్డి మండలాల్లో పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు.

**సమన్వయంతో ముందుకు...**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్నికల క్యాంపెయినింగ్ బాధ్యతలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌తో కలిసి సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. మరో ఇన్‌చార్జీగా నియమించిన ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి సైతం నిత్యం కామారెడ్డిలోనే కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ సమన్వయ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే కామారెడ్డి నియోజకవర్గంలో ప్రచార పర్వాన్ని ఉధృతంగా నిర్వహించేందుకు సమన్వయ కమిటీని సైతం బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసింది. ఇందులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిరుమల్ రెడ్డి, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు నిట్టు వేణుగోపాల్, పున్నా రాజేశ్వర్, ఎల్. నర్సింగరావుతో సమన్వయ కమిటీ ఏర్పడింది. ఈ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలోనే ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రతిపక్షాలను రాజకీయంగా దెబ్బకొట్టేందుకు సమన్వయ కమిటీ నిత్యం సంప్రదింపులు జరుపుకుంటూ ముందుకు సాగుతున్నది. బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ సలహాలు, సూచనలతో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకంలో సమన్వయ కమిటీ మండలాల వారీగా అన్ని వర్గాల నాయకత్వాన్ని కలుపుకొని ముందుకు కదులుతున్నది.

**నేరుగా శ్రేణులతో సమావేశాలు...**

రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీకి లేనంతా కార్యకర్తల బలం భారత రాష్ట్ర సమితి సొంతం. కామారెడ్డి నియోజకవర్గంలోనూ దాదాపు 5లక్షలకు పైగా సభ్యులతో బీఆర్ఎస్ పార్టీ సైన్యం అందుబాటులో ఉంది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు కనీసం సభ్యత్వాలకు ముందుకు రాని దుస్థితి ఏర్పడడంతో వారి పార్టీలో కార్యకర్తలే లేకపోవడంతో వెలవెలబోతున్నది. ఈ పరిస్థితుల్లో కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న కేసీఆర్‌కు భారీ మెజార్టీ లక్ష్య సాధనలో భాగంగా పార్టీ శ్రేణులతో ముఖ్యమైన సమావేశాలను నిర్వహిస్తోంది. ప్రజల అవసరాలు, అభివృద్ధి పనుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వచ్చే ప్రభుత్వంలో వాటిని నెరవేర్చేందుకు హామీలు సైతం ఇస్తున్నారు. కేసీఆరే స్వయంగా వచ్చి పోటీ చేస్తున్న నియోజకవర్గానికి అభివృద్ధి పనుల విషయంలో, మౌలిక సదుపాయాల కల్పనలో పెద్ద పీట దక్కుతుందన్న విషయాన్ని శ్రేణులంతా ప్రజలకు వివరిస్తున్నారు. భారీ మెజార్టీ కోసమై కేటీఆర్ నేరుగా శ్రేణులతో సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశనం చేస్తున్నారు. మంగళవారం పాత మాచారెడ్డి మండలం పరిధిలో సమావేశం జరుగనున్నది. కేటీఆర్ హాజరై కార్యకర్తలతో మాట్లాడనున్నారు. తదనంతరం మధ్యాహ్నం కామారెడ్డి పట్టణంలోని వీక్లి మార్కెట్ మైదానంలో కామారెడ్డి పాత మండలం ప్రాతిపాదికన సమావేశం నిర్వహిస్తున్నారు. ఇందులోనూ కేటీఆర్ పాల్గొని గులాబీ శ్రేణులను ఉత్తేజపర్చనున్నారు. బుధవారం పాత భిక్కనూర్, పాత దోమకొండ మండలాల వారీగా సమావేశాలు జరుగనున్నాయి. భిక్కనూర్‌లో ఏర్పాట్లను సోమవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పరిశీలించారు.

## తనిఖీల్లో రూ.11.56 లక్షలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 30 : ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు 20 రోజులుగా వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఏసీపీ కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో నగర సీఐ నరహరి ఆధ్వర్యంలో రెండోటౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో ఎస్సై అశోక్ సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. వర్ని చౌరస్తాలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న షేక్ ఫిరోజ్ అనే వ్యక్తి పై అనుమానంతో అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా రూ.11.56 లక్షల నగదు లభించినట్లు తెలిపారు. డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తం నగదును ఐటీ శాఖ అధికారులకు అప్పగించినట్లు నగర సీఐ నరహరి పేర్కొన్నారు. ఈ తనిఖీలో సిబ్బంది రామకృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీపీ



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న సీపీ కల్మేశ్వర్

భీమ్‌గల్, అక్టోబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భీమ్‌గల్ పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను సీపీ కల్మేశ్వర్ శింగేనవార్ సోమవారం పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల శిక్షణ కేంద్రం, బ్యాలెట్ పత్రాలు, ఎన్నికల సామగ్రి పంపిణీ, నామినేషన్ సెంటర్ కేంద్రాలను సీపీ పరిశీలించారు. ఓటింగ్ ప్రక్రియకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంలను భద్రపర్చే స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించి ఎన్నికల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట అడిషనల్ డీసీపీ జయరాం, ఏఆర్ డీసీపీ గిరిధర్‌రెడ్డి, ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చంద్ర, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై హరిబాబు, సిబ్బంది ఉన్నారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందిగా సీఐను ఈ సందర్భంగా సీపీ ఆదేశించారు. నామినేషన్ వేసే సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు.

## సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రంలో దళితులకు సముచిత స్థానం



డాక్టర్ మధుశేఖర్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

**డాక్టర్ మధుశేఖర్ అభినందన సభలో ప్రముఖులు**

భీమ్‌గల్, అక్టోబర్ 30 : రాష్ట్రంలో దళితులకు సముచిత స్థానం లభిస్తున్నదని రాష్ట్ర మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, బుద్ధవనం స్పెషల్ అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య అన్నారు. భీమ్‌గల్‌లో నిర్వహించిన డాక్టర్ మధుశేఖర్ అభినందన సభ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇటీవల డాక్టర్ మధుశేఖర్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో దళిత ఐక్య సంఘటన ఆధ్వర్యంలో సోమవారం అభినందన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ మధుశేఖర్‌కు పదవి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దళితుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారి అభ్యున్నతికి పాటు పడుతున్న ఏకైక సీఎం కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో నిర్మించిన సెక్రటేరియేట్,అంబేద్కర్ విగ్రహాల నిర్మాణంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ఈ ప్రాంత వాసులకు ఎమ్మెల్యేగా ఉండడం అదృష్టం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలతా సురేందర్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, ముత్తెన్న, దళిత సంఘాల నాయకులు రాజేశ్, శంకర్, ఏలియా, గంగాధర్, ప్రసాద్ నవీన్ తదితరులు పాలొన్నారు.



కొత్త ప్రభాకర్ రెడ్డి పై కత్తితో దాడి ఘటన తెలిసి కామారెడ్డి జిల్లా పర్యటనలో ఉన్న సీఎం కేసీఆర్ మంత్రి హరీశ్‌రావుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. సీఎం వెంట మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఉన్నారు.

## ప్రభాకర్ రెడ్డిపై హత్యాయత్నం అమానుషం

- రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 30 :దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై ఎన్నికల ప్రచార సందర్భం గా కత్తితో దాడి చేసిన ఘటనను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో హత్యా రాజకీయాలకు తావు లేదని పేర్కొన్నారు. బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభాకర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

## బీఆర్ఎస్ నుంచి చంద్రశేఖర్ రెడ్డి సస్పెన్షన్

కామారెడ్డి,అక్టోబర్ 30 : కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందూప్రియ భర్త బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ నియమావళికి విరుద్ధంగా వ్యవహరించినందుకు క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా పార్టీ నుంచి తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ఎమ్మెల్సీ, కామారెడ్డి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి శేరి సుభాష్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED TEACHERS**

★Wanted Teachers to Teach Nursery to VII (E/M), PET, Vice Principal, Principal, Office boy, Clerk, Incharges, Contact (Saloora, Bodhan) Cell: 9948378237

NTZ-318467

**WANTED**

★రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.

NT-320535

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్: 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.